క్లుప్తంగా

నేడు పాలకొల్లులో ఆసరా సంబరాలు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని సాయిబాబా గుడి రోడ్డులోని అడబాల గార్డెన్స్‌లో శుక్రవారం ఉదయం 10గంటలకు ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలో భాగంగా వరుసగా నాలుగో విడత డ్వాక్రా రుణ మాఫీ అమలు చేసిన సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో పోడూరు, యలమంచిలి, పాలకొల్లు పట్టణ, మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న తత్వప్రవచనాలు



బాలస్వామిని సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: పరమేశ్వరి తత్వం మహోన్నమైనదని నైమిశారణ్య పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు బాల బ్రహ్మానంద సరస్వతి అన్నారు. గురువారం పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో బాల స్వామిజీ పరమేశ్వరి తత్వ ప్రవచనం ఆకట్టుకొంది. ప్రవచనం అనంతరం బాల స్వామిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ నూలి తాతాజీ, ఆసున గరి, ఆలయ అర్చకుడు కేవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధి వేగవంతం



ఆచంట వేమవరంలో నిర్మాణంలో ఉన్న రహదారిని పరిశీలిస్తున్న నాయకులు

పెనుగొండ: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో ఆచంట వేమవరంలో రహదారుల అభివృద్ధి చేపట్టినట్లు సర్పంచ్ జక్కంశెట్టి చంటి తెలిపారు. రహదారుల నిర్మాణాలను గురువారం పర్యవేక్షించారు. గ్రామంలో 15 ఏళ్లుగా పలు ప్రాంతాల్లో రహదారుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో సమస్యలను మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో తక్షణం రహదారి నిర్మాణాలకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టరు అందే నాగ బసవన్న, పంచాయతీ సభ్యుడు తమ్మ కనకదుర్గ కనకరాజు, కొడమంచిలి రాజు, కోమటి సూరిబాబు, గుడిమెట్ల రామలింగం పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ అధికారులు

భీమవరం: జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయనను కలిసి ప్రజా పాలనలో అన్ని విధాలుగా సహకారిస్తామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గుమ్మల్ల జకరయ్య, భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడీ, ఉపాధ్యక్షుడు తాళ్ల దానయ్య, కార్యదర్శి పంపన సురేష్, నిమ్మల రామాంజనేయులు, రంప రత్నంరాజు తదితరులు ఉన్నారు.

కస్తూరిబా గాంధీకి నివాళి

భీమవరం: కస్తూరిబా గాంధీ వర్ధంతిని భీమవరం పట్టణంలోని కస్తూరిబా గాంధీ భవనంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గత 15 ఏళ్ళుగా మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్న రత్నమాల, దుర్గాదేవిలను సత్కరించారు. ఈ సందర్భంగా పెదనింద్రకొలను గాంధీ భవనం అభివృద్ధికి ఎస్ఎల్ఎన్ బాపిరాజు రూ.2.5 లక్షలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కార్యదర్శి ఎం.కృష్ణంరాజు, ఇందుకూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజిలెన్స్ దాడులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జువ్వల పాలెం రోడ్డులోని ఓ పచ్చళ్ల దుకాణంపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా, 6 సబ్సిడీ (గృహ అవసరాల) గ్యాస్ సిలిండర్లను గుర్తించామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ తెలిపారు. వీటి విలువ రూ.16,002 ఉంటుందని చెప్పారు. దుకాణ యజమానిపై నిత్యవసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. భీమవరం సీఎస్ ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో చురుగ్గా రోడ్ల అభివృద్ధి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



చిట్టవరంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడంతో నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు రహదారుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం మండలంలోని చిట్టవరం గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో నాణ్యతాలోపంతో రోడ్లు నిర్మించడం వల్ల భారీ వర్షాలకు దెబ్బతినడంతో వాటి పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రభుత్వం నుంచి కోట్లాడి రూపాయలు నిధులను మంజూరు చేయించి నియోజకవర్గ రహదారులన్నీ నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే కొన్ని రహదారులను పూర్తి చేసుకుని ప్రారంభించామని, మరికొన్ని రహదారుల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. నిర్మాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యతతో పనులు చేయిస్తున్నామన్నారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామాలకు అనుసంధానమైన రహదారులను త్వరలో పూర్తి చేసుకుని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణ, కోళ్ల శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ వైవి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరింత సుందరంగా కాటన్ పార్కు



కాటన్‌పార్కులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్,కమిషనర్

నరసాపురం: పట్టణంలో రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న కాటన్‌పార్కును మరింత అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. కాటన్‌పర్కులో 15వ ఆర్థికసంఘం నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసాదరాజు ఆదేశాలతో కాటన్‌పార్కును సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. ఇప్పటికే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వివరించారు. పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసి అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏప్రిల్ నాటికి పార్కులో చేపట్టిన పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లాడి బుజ్జి, వల్లభూని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం నుంచి పాలకొల్లు వచ్చే 11 కేవీ వర్క్స్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు కారణంగా పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు గురువారం నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్ కుమార్ విలేకరులకు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. రామారావుపేట, బీఆర్ఎంవీ స్కూల్, శ్రీరామంపేట, మెయిన్‌రోడ్డు, శంభునిపేట, బ్రాడీపేట, వడలివాని పేట, బ్యాంక్ కాలనీ, సూర్యతేజస్ నగర్, సుబ్బారాయుడు గుడి సెంటర్, బంగారు వారి చెరువుగట్టు, బ్రాడీపేట ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మండలంలోని మూడు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయన ఏర్పడుతుంది విద్యుత్ శాఖ ఈఈ బి.సురేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొగల్తూరు, కాళీపట్నం, కెపిపాలెం సబ్ స్టేషన్లలో మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం, తూర్పుతాళ్లు సబ్ స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ బి.సురేష్‌కుమార్ తెలిపారు. సీతారామపురం, రాజుగారితోట, యర్రంశెట్టిపాలెం, మండవారిపేట, మంగళగుంటపాలెం, కొప్పర్రు, రుస్తుంబాద, ఎల్బీచర్ల, పసలదీవి, తూర్పుతాళ్లు, మర్రితిప్ప, పెదమైనవానిలంక, వేములదీవి, బియ్యపుతిప్ప, దర్భరేవు, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ప్రకటించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ యలమంచిలి మండల ఎస్సీ సెల్ కమిటీ ఎంపిక



యలమంచిలి మండల ఎస్సీ సెల్ సభ్యులను అభినందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: మండలంలోని కాంబొట్లపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంద హరికుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో మండల ఎస్సీ సెల్ కమిటీని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా చుట్టుగుల్ల అప్పారావు, దిడ్ల విజయ్‌కుమార్ ప్రధాన కార్యదర్శులుగా నల్లి నరేష్, పైడి వెంకటేశ్వరరావు, ముప్పిడి కుమార్, గోనిపాటి బాబూరావు కార్యదర్శులుగా పిడకల బాబూరావు, తాడి నరసింహారావు, గోనిపాటి చిట్టిబాబు, కనపాల మోహన్ రావు, గొల్ల ఎలీషారాజు, తానేటి చిన్న, బళ్ల నరసింహారావు, కాట్ర శ్రీను సంయుక్త కార్యదర్శులుగా బుంగా బాబూరావు, కొండేటి రాజు, తానేటి శ్రీను, కొంబత్తుల దుర్గాప్రసాద్, సరెళ్ల ఆనందరావు, కోడెల్ల చంటిబాబు, చవ్వాకుల రమేష్, కోరం చిట్టిబాబులు ఎంపికయ్యారు. సమావేశం అనంతరం పాలకవర్గ సభ్యులంతా పాలకొల్లు వెళ్లి వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)ని మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీకి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, ఎంపీపీ రావూరి వెంకటరమణ, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వల్లభసాయి వెంకట నరసింహారావు, వైఎస్సార్ సీపీ యువజన రాష్ట్ర నాయకుడు ఉచ్చుల స్టాలిన్ తదితరులు శుభాకాంక్షలు చెప్పారు.

ప్రాధాన్యతక్రమంలో సమస్యల పరిష్కారం



మేడపాడులో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ

యలమంచిలి: మేడపాడు గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ చెప్పారు. మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో మేడపాడు గ్రామంలోని హైస్కూల్ ప్రాంతంలో వేస్తున్న సిమెంట్ రోడ్డు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్ గంటా శాంతకుమారి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు పంచాయతీ పాలకవర్గ సభ్యుల సహకారంతో గ్రామంలో ప్రతి ఇంటికీ నామ మాత్రపు రుసుముతో కుళాయి కనెక్షన్స్ ఇస్తున్నట్లు చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వ నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆమె వివరించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు దేగల వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఏఈ వర్ధనపు శ్యాంబాబు ఇంజనీరింగ్ అసిస్టెంట్ పులపర్తి సునీల్ తదితరులు ఉన్నారు.

28 నుంచి సాహిత్య సదస్సు



బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పెనుగొండ: స్థానిక ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో ఈనెల 28, 29 తేదీల్లో తెలుగు భాషా సాహిత్యాలపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నామని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ వైవీవీ అప్పారావు తెలిపారు. గురువారం కళాశాలలో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్, ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాల మాదిరిగా తెలుగు సాహిత్యం కోసం ఏటా అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు అవకాశం ఇచ్చిన తెలుగు సంపద సలహాదారు మూర్తి రేమేళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో ఫ్రాన్స్, అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ దేశాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

వీరవాసరం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సక్రమ నిర్వహణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు భీమవరం రూరల్ సీఐ సత్య కిషోర్ తెలిపారు. వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు.

కన్నెగంటి హనుమంతుకు ఘన నివాళి



కన్నెగంటి హనమంతు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కన్నెగంటి హనుమంతు లాంటి పోరాట యోధులను నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని శ్రీకృష్ణ దేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు యర్రంశెట్టి వెంకటరత్నం అన్నారు. గురువారం పట్టణంలోని ఓ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన కన్నెగంటి హనుమంతు 102వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ భావితరాలకు ఇలాంటి పోరాట యోధుల చరిత్ర గుర్తుండే విధంగా గుంటూరు జిల్లాకు కన్నెగంటి హనుమంతు పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వంగా నరసింహరావు, బోనం వెంకట నరసయ్య, అడబాల రమణ, ముచ్చర్ల సంజయ్, ముచ్చర్ల శ్రీరామ్, పెనుమాక రామ్మోహన్, రావూరి సుధ, కొట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహారెడ్డి వర్ధంతి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. పరిశోధనాస్థానం ఇన్‌చార్జ్ ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు నరసింహారెడ్డి జీవిత చరిత్ర, వారి పోరాట పటిమ వంటి విషయాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులంతా మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ భావిభారత పౌరులుగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయ సహాయం అందించాలి

భీమవరం: న్యాయ విద్యను పూర్తిచేసిన విద్యార్థులు సమాజంలో పేదలకు న్యాయ సహాయం అందించాలని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) అన్నారు. డీఎన్నార్ లా కళాశాల 34వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయ విద్యార్థుల కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎల్ఎల్ఎం కోర్సులను ప్రారంభించడానికి చర్యలు తీసుకున్నట్లు బాబు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు, సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, కళాశాల కో ఆర్డినేటర్ ఎం.కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ కె.రఘురామ్, జి.గోపాలకృష్ణంరాజు, చెల్లబోయిన రంగారావు పాల్గొన్నారు.

ఘనంగా కోడి రామకృష్ణ వర్ధంతి



కోడి రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ప్రముఖ సినీ దర్శకుడు కోడి రామకృష్ణ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక మారుతి థియేటర్‌లో కోడి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర చరిత్రలో దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు వారసుడిగా శతాధిక చిత్రాలకు దర్శకత్వం వహించిన కోడి రామకృష్ణ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవ అధ్యక్షులు మేడికొండ శ్రీనువాస్, థియేటర్ మేనేజర్ దేవళ్ల బుజ్జి, విటాకుల రమణ, అడబాల రమణ, ముత్యాల సత్యనారాయణ, కొయ్యాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు వలంటీర్ల అండ



శేషమ్మ చెరువులో వలంటీర్లను సత్కారిస్తున్న దృశ్యం

పెనుగొండ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలనకు వలంటీర్లు అండగా నిలిచి పేదలకు సంక్షేమాన్ని నేరుగా అందించారని ఆచంట మండలం శేషమ్మ చెరువు సర్పంచ్ జక్కంశెట్టి శ్రీరాములు అన్నారు. గురువారం శేషమ్మ చెరువు సచివాలయంలో సేవా వజ్ర అవార్డు పొందిన దొంగ ఆషా, సేవా రత్న అవార్డు పొందిన చిలుకూరి మేఘమాల, సేవా మిత్ర పురస్కారం పొందిన వలంటీర్లును ఘనంగా సత్కరించారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. వారి సేవలకు సీఎం జగన్ గుర్తించి పురస్కారాలతో సత్కరిస్తున్నారన్నారు. సీఎం జగన్‌కు వలంటీర్లు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పోరేషన్ డైరక్టరు మామిడిశెట్టి కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కంశెట్టి శివ, కార్యకర్తలు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్తూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మూడు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, అర్హులైన వారు మార్చి1వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు తమ కార్యాలయంలో స్వయంగా దరఖాస్తులందించాలని సీడీపీఓ బి.ఊర్మిల గురువారం ఓ ప్రకటనలో కోరారు. మొగల్తూరు మండలం కాళీపట్నం పడమరలోని వంతెన సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు (బీసీ-ఏ), జగన్నాదపురంలోని దారితిప్ప అంగన్‌వాడీ కేంద్రంలో (ఓపెన్), నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని చాగంటివారిమెరక అంగన్‌వాడీ కేంద్రంలో(బీసీ-బీ) సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు పదోతరగతి సర్టిఫికెట్, నివాసం, కుల ధ్రువీకరణ ప్రతం, దివ్యాంగురాలై ఉంటే అందుకు సంబంధించి డాక్టర్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని తెలిపారు.

విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనాలి



కొవ్వాడలో రోడ్లను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

భీమవరం: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మంగం వేణు అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కళాశాల యూనిట్ ఆధ్వర్యాన కొవ్వాడ గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు శిబిరంలో గ్రామ ప్రజలకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పంపిణీ, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించడమేకాక రోడ్లను శుభ్రం చేయడం, స్కూల్ విద్యార్థులకు ఆంగ్లభాషలో ఎలా మాట్లాడాలి, ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్, కళాశాల అధ్యాపకులు బి.వెంకట నాగరాణి, సుబ్బారెడ్డి, కె.గంగరాజు, కె.పుష్పవల్లి, చంద్రశేఖర్, కృష్ణమాధురి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సమస్యలపై దృష్టి పెట్టాలి

వీరవాసరం: ప్రజల ఆరోగ్య సమస్యల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో భాను నాయక్ సూచించారు. వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోనే గర్భిణులకు ఫ్రీ డెలివరీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఓపీ రూమ్, మందుల గది, డెలివరీ రూమ్, ఓపీ రికార్డులను పరిశీలించారు.

పంట కాలువలో తూడు తొలగింపు

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరు పంట కాలువలో పేరుకుపోయిన తూడును ప్రొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు. ఈ పంట కాలువ ద్వారా భీమవరం పట్టణం మీదుగా కొమరాడ, అనాకోడేరు, తుమ్మగొప్పి గ్రామాలకు సాగు, తాగునీరు అందుతోంది. పంట కాలువను ఆనుకుని ఉన్న సుమారు 6 వేల ఎకరాల రొయ్యల చెరువులు, చేపల చెరువులు, వరి పొలాలకు సాగునీరు, రక్షిత మంచినీటి చెరువులకు తాగునీరు అందుతోంది. పంట కాలువలో గుర్రపు డెక్క, తూడు, సిల్టు పేరుకుపోవడంతో నీటి సరఫరాకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని రైతులు, గ్రామస్తులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే నిధులు మంజూరు చేయడంతో ఇరిగేషన్ అధికారులు కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క, సిల్టును తొలగిస్తున్నారు. అంతేకాక ఎగువన ఉన్న పట్టణ వాసులు ప్లాస్టిక్, థర్మాకూల్ పెట్టెలు, బొంతలు, చిరిగిన బ్యాగులు పంట కాలువలో డంప్ చేయడంతో ఇరిగేషన్ అధికారులకు వాటిని తొలగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇరిగేషన్ ఏఈ ప్రసాదరాజు మాట్లాడుతూ పంట కాలువల్లో చెత్త వేయకూడదని, ఆ నీటిని దిగువ ప్రాంతాలు వారు తాగుతారని గ్రహించాలని కోరారు. ఎవరైనా చెత్త వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.